**ఆంధ్రప్రదేశ్ ఆధార్ (లక్షిత ఆర్థికపరమైన మరియు ఇతర సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలను అందించుట) చట్టము, 2023**

**పరిచ్ఛేదములు**

1. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము
2. నిర్వచనములు
3. కొన్ని సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలు మొదలగు వాటిని అందుకొనుటకు అవసరమైన ఆధార్ సంఖ్య రుజువు
4. పథకములను అధిసూచించుట
5. సద్భావముతో తీసుకున్న చర్యలకు రక్షణ
6. నియమములను చేయుటకు అధికారము
7. చిక్కును తొలగించుటకు అధికారము
8. రద్దు మరియు మినహాయింపులు

# ఆంధ్రప్రదేశ్ ఆధార్ (లక్షిత ఆర్థికపరమైన మరియు ఇతర సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలను అందించుట) చట్టము, 2023

## (2023లోని 43వ చట్టము)

**ఒక వైయక్తిక వ్యక్తి గుర్తింపును నిరూపించుటకు ఏకైక రుజువుగా ఆధార్ సంఖ్యను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో నివసించుచున్న వైయక్తిక వ్యక్తులకు సమర్థవంతమైన, పారదర్శకమైన సుపరిపాలన మరియు లక్షిత సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలను అందించుటకు, దానికైన ఖర్చును పూర్తిగా రాష్ట్ర సంచిత నిధి నుండి భరించుట కొరకు మరియు అందుకు సంబంధించిన లేదా అందుకు ఆనుషంగికమైన విషయముల కొరకు నిబంధించుటకైన చట్టము.**

భారత ప్రజారాజ్యపు డెబ్భై నాలుగవ సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి ఈ క్రింది విధముగా శాసనము చేసినది.

**1. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము :–** (1) ఈ చట్టమును ఆంధ్రప్రదేశ్ ఆధార్ (లక్షిత ఆర్థికపరమైన మరియు ఇతర సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలను అందించుట) చట్టము, 2023 అని పేర్కొనవచ్చును.

(2) ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటికి వర్తించును.

(3) ఇది 14 జూలై, 2023వ తేదీ మరియు అప్పటి నుండి అమలులోనికి వచ్చినట్లు భావించబడవలెను.

**2. నిర్వచనములు :–** (1) ఈ చట్టములో సందర్భము ఇతర విధముగా కోరిననే తప్ప,–

(ఎ) "ప్రభుత్వ ఏజెన్సీ" అనగా, ప్రభుత్వ స్వామిత్వము మరియు నియంత్రణ కలిగి ఉండిన స్థానిక సంస్థలు మరియు ఏదేని ఇతర సంస్థతో సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో ఏదేని కేంద్ర లేదా రాష్ట్ర శాసనముచే స్థాపించబడిన లేదా ఏర్పాటు చేయబడిన ఏదేని ప్రాధికార సంస్థ లేదా సంస్థ అని అర్థము మరియు వాటి స్థాపన మరియు పాలన ప్రధానముగా ప్రభుత్వముచే నియంత్రించబడిన సంస్థలు చేరియుండును;

(బి) "ప్రయోజనము" అనగా వైయక్తిక వ్యక్తి లేదా వైయక్తిక వ్యక్తుల గ్రూపుకు సమకూర్చిన ఏదేని సానుకూలం, బహుమతి, పారితోషికం, సహాయం లేదా నగదు లేదా వస్తు రూపంలో చెల్లింపు అని అర్థము మరియు ఇందులో ప్రభుత్వము ఆయా సమయములలో అధిసూచించునట్టి ఇతర ప్రయోజనములు చేరియుండును;

(సి) "కేంద్ర చట్టము" అనగా ఆధార్ (లక్షిత ఆర్థికపరమైన మరియు ఇతర సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలను అందించుట) చట్టము, 2016 అని అర్థము; (2016లోని 18వ కేంద్ర చట్టము)

(డి) "సంచిత నిధి" అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచిత నిధి అని అర్థము;

(ఇ) "ప్రభుత్వము" అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము అని అర్థము;

(ఎఫ్) "విహితపరచబడిన" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(జి) "సేవ" అనగా ఒక వైయక్తిక వ్యక్తికి లేదా వైయక్తిక వ్యక్తుల గ్రూపుకు ఏదేని ప్రరూపములో సమకూర్చిన ఏర్పాటు, సదుపాయం, ప్రయోజకత లేదా ఏదేని ఇతర సహాయం అని అర్థము మరియు ఆయా సమయములలో ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి ఇతర సేవలు చేరియుండును;

(హెచ్) “సబ్సిడీ” అనగా ఒక వైయక్తిక వ్యక్తికి లేదా వైయక్తిక వ్యక్తుల గ్రూపుకు ఏదేని ప్రరూపములో నగదుగా లేదా వస్తు రూపంలో సహాయము, మద్దతు, గ్రాంటు, ఆర్థిక సహాయం లేదా ప్రత్యేక వినియోగం అని అర్థము మరియు ఆయా సమయములలో ప్రభుత్వముచే అధిసూచించబడునట్టి ఇతర సబ్సిడీలు చేరియుండును.

(2) ఈ చట్టములో ఉపయోగించబడినవై, నిర్వచింపబడని మరియు కేంద్ర చట్టములో నిర్వచించబడిన పదములు మరియు పదబంధములు, కేంద్ర చట్టములో వాటికి వరుసగా ఒసగబడిన అవే అర్థములను కలిగియుండవలెను.

**3. కొన్ని సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలు మొదలగు వాటిని అందుకొనుటకు అవసరమైన ఆధార్ సంఖ్య రుజువు :–** ప్రభుత్వము లేదా ఒక ప్రభుత్వ ఏజెన్సీ, సబ్సిడీ, ప్రయోజనము లేదా సేవను పొందుట కొరకు ఒక షరతుగా ఒక వైయక్తిక వ్యక్తి గుర్తింపును నిరూపించు నిమిత్తము సంచిత నిధి లేదా ప్రభుత్వ ఏజెన్సీ ఏర్పాటు చేసిన ఏదేని నిధిలో భాగమైన ఉపసంహరణ ద్వారా లేదా రాబడి నుండి చేసిన ఖర్చుకు సంబంధించి అట్టి వైయక్తిక వ్యక్తి అధిప్రమాణీకరించమని కోరవచ్చును లేదా ఆధార్ సంఖ్యను కలిగియున్న రుజువును దాఖలు చేయమని కోరవచ్చును లేదా ఎట్టి ఆధార్ సంఖ్య ఈయబడని వైయక్తిక వ్యక్తి విషయంలో నమోదు కొరకు అట్టి వైయక్తిక వ్యక్తి దరఖాస్తు చేసుకొనవలెను:

అయితే, వైయక్తిక వ్యక్తికి ఆధార్ సంఖ్యను ఒసగబడు వరకు, సబ్సిడీ, ప్రయోజనము లేదా సేవను అందించుట కొరకు ప్రత్యామ్నాయ మరియు ఆచరణీయమైన సాధనాలను అట్టి వైయక్తిక వ్యక్తికి ఈయవచ్చును.

**4. పథకములను అధిసూచించుట :–** ప్రభుత్వము, ఈ చట్టపు ప్రారంభపు తేదీ నుండి మూడు మాసముల కాలావధిలోగా మరియు అటు పిమ్మట ఆయా సమయములలో ఒక వైయక్తిక వ్యక్తి యొక్క అధిప్రమాణీకరించబడిన గుర్తింపు రుజువుగా ఆధార్ సంఖ్య ఉండవలసినట్టి పథకములు, సబ్సిడీలు, ప్రయోజనములు లేదా సేవల జాబితాను అధిసూచించవలెను.

**5. సద్భావముతో తీసుకున్న చర్యలకు రక్షణ :–** ఈ చట్టము లేదా దాని క్రింద చేయబడిన నియమముల క్రింద సద్భావముతో చేసిన లేదా చేయుటకు ఉద్దేశించిన దేని కొరకు గాని ప్రభుత్వము, లేదా ప్రభుత్వమునకు చెందిన ఎవరేని అధికారి లేదా ఇతర ఉద్యోగులపై ఎట్టి దావా, ప్రాసిక్యూషను లేదా ఇతర శాసనిక చర్యలు ఉండవు.

**6. నియమములను చేయుటకు అధికారము :–** (1) ప్రభుత్వము ఈ చట్టపు ప్రయోజనాలన్నింటిని నెరవేర్చుటకై ఆంధ్రప్రదేశ్ గెజెటులో అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును.

(2) ఈ అధ్యాదేశము క్రింద చేసిన ప్రతి నియమమును, దానిని చేసిన వెంటనే అప్పుడు రాష్ట్ర శాసనమండలి సమావేశమునందున్నచో ఆ సమావేశములోను అది సమావేశములో లేనిచో తదనంతర సమావేశములోను దాని సమక్షమున మొత్తము పదునాలుగు దినముల కాలావధి పాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే సమావేశములోగాని లేదా రెండు అనుక్రమ సమావేశములలోగాని చేరియుండవచ్చును. అట్లు దానిని ఉంచిన సమావేశములోగాని తదనంతర సమావేశములోగాని లేదా పైన పేర్కొనిన అనుక్రమ సమావేశములు ముగియుటకు పూర్వము శాసనమండలి ఆ నియమములో ఏవేని మార్పులు చేయుటకు లేక నియమమును రద్దు చేయుటకు అంగీకరించినచో ఆ మార్పు లేక రద్దు ఆంధ్రప్రదేశ్ గెజెటులో ఆ నియమము అట్లు మార్పు చేయబడిన రూపములో మాత్రమే అమలు కలిగియుండును లేక సందర్భానుసారముగా రద్దు అగును. అయినప్పటికీ ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని ఆ నియమము క్రింద అంతకు పూర్వము చేయబడిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

**7. చిక్కును తొలగించుటకు అధికారము :-** (1) ఈ అధ్యాదేశములోని నిబంధనలను అమలుచేయుటలో ఏదేని చిక్కు ఏర్పడినచో ప్రభుత్వము, అట్టి చిక్కుని తొలగించుటకు అవసరమని తమకు తోచినట్టి, ఈ అధ్యాదేశములోని నిబంధనలకు అసంగతముకాని అట్టి నిబంధనలను అధికారిక గెజెటులో ప్రచురించిన ఉత్తరువు ద్వారా చేయవచ్చును:

అయితే, అట్టి ఉత్తరువు ఏదియు, ఈ అధ్యాదేశము ప్రారంభమైన తేదీ నుండి రెండు సంవత్సరములు గడచిన పిమ్మట చేయరాదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద చేసిన ప్రతియొక ఉత్తరువు, దానిని చేసిన తరువాత వీలైనంత త్వరగా రాష్ట్ర శాసనమండలి సమక్షమున దానిని ఉంచవలెను.

**8. రద్దు మరియు మినహాయింపులు :-** (1) ఆంధ్రప్రదేశ్ ఆధార్ (లక్షిత ఆర్థికపరమైన మరియు ఇతర సబ్సిడీలు, ప్రయోజనములు మరియు సేవలను అందించుట) అధ్యాదేశము, 2023 ఇందుమూలముగా రద్దు చేయబడినది. (2023లోని 6వ అధ్యాదేశము రద్దు)

(2) అట్టి రద్దుతో సంబంధం లేకుండా, సదరు అధ్యాదేశము క్రింద చేసిన ఏదేని లేదా తీసుకున్న ఏదేని చర్య ఈ చట్టం క్రింద చేసిన లేదా తీసుకున్నదిగా భావించబడవలెను.